# నిత్యం యోగా చేయాలి



బిచ్కుందలో యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే,


పిట్లం పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జూన్ 21 : ప్రపంచ యోగా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. లింగంపేటలోని నాగన్న బావి వద్ద 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసి న కార్యక్రమంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం యోగా చేయాలని సూచించారు. కలెక్టర్ విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం కామారెడ్డి జిల్లా యోగా విభాగం అధ్యక్షుడు రాంరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో 32 యోగా కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిచ్కుందలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సహజ సిద్ధ యోగా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా శిబిరంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొన్నారు. యోగా గురువు సాయిలు ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా షిండే మాట్లాడారు. ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం ఆపరేషన్ 'సిందూర్'లో పాల్గొన్న వీర జవాన్ రాజ్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. కామారెడ్డిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా యోగా భవన్‌లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాన్సువాడ మండలం బోర్లం క్యాంపులోని ఆదర్శ యువజన సంఘం సభ్యులు యోగా డే లో పాల్గొని ఆసనాలు వేశారు. దేవునిపల్లి పీఎస్‌లో ఎస్సై రాజు ఆధ్వర్యంలో సిబ్బంది యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సైతోపాటు సిబ్బంది యోగాసనాలు వేశారు. మాచారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎల్లారెడ్డిలో యోగాచార్యులు సుజాత నాగ రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో, ఎల్లారెడ్డి కోర్టు ఆవరణలో, మోడల్ స్కూల్‌లో యోగా కార్యక్రమాలను నిర్వహించారు. మల్లాయిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథం ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని చేపట్టారు. రామారెడ్డిలోని పాఠశాల ఆవరణలో మార్నింగ్ వాకర్స్ బ్యాచ్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ఇసన్నపల్లిలో ఉపాధి హామీ సైట్ వద్ద కూలీలతో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ వామన్‌రావు ఆధ్వర్యంలో యోగా ట్రైనర్ లక్ష్మీనారాయణ కూలీలకు యోగాసనాలు నేర్పించారు. మద్నూర్ మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. వివిధ పాఠశాలలు, పతంజలి యోగాపీఠ ఆధ్వర్యంలో గురు ఫంక్షన్ హాలులో కార్యక్రమం ఏర్పాటు చేశారు. భిక్కనూరు, నాగిరెడ్డిపేటలో యోగా దినోత్సవాన్ని అధికారులు, ప్రజాప్రతి నిధులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఆదర్శ, కస్తూర్బా, గోపాల్‌పేట ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్, సిద్ధార్థ కళాశాలలో విద్యార్థులతో కలిసి ఎంపీడీవో ప్రభాకర్, గ్రామ కార్యదర్శులు, ఉపాధ్యాయులు యోగా చేశారు. పెద్ద కొడప్‌గల్, పిట్లం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర కార్యాల యాల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులతో యోగా ట్రెయినర్లు ధర్మేందర్, సంజీవులు ఆసనాలు వేయిం చారు. బాన్సువాడలోని అంబేద్కర్ భవనంలో ఆయూష్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు. పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో న్యాయమూర్తి భార్గవి ఆధ్వర్యంలో యోగా శిబిరం నిర్వహించారు. బాన్సు వాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ఉపాధ్యాయులు ఆసనాలు వేయించారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం


లింగంపేటలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్


కామారెడ్డిలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి


మద్నూర్‌లో యోగాలో పాల్గొన్న విద్యార్థులు


ఎల్లారెడ్డిలో యోగాలో పాల్గొన్న పట్టణ ప్రజలు

## లింగంపేట కార్యదర్శిపై కలెక్టర్ ఆగ్రహం..

### షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

లింగంపేట, జూన్21: గ్రామాల్లో నిత్యం డ్రై డే కార్యక్రమాలు కొనసాగించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. లింగంపేట మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులను శనివారం ఉదయం పరిశీలించారు. గత ఏడాది డెంగ్యూ బారిన పడిన బాధితుల ఇంటి పరిసరాలు, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణపై అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనుల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణపై నిర్లక్ష్యం వహించడంతో స్థానిక గ్రామ కార్యదర్శి శ్రవణ్ కుమార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీపీవో మురళికి ఆదేశాలు జారీ చేశారు. మురికి కాలువలు శుభ్రం చేయించాలని సూచించారు. మండలంలో గతేడాది నమోదైన డెంగ్యూ కేసుల వివరాలు వైద్యురాలు రాంబాయిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం 28 కేసులు నమోదవగా మండల కేంద్రంలో 15 కేసులు నమోదైనట్లు పీహెచ్‌సీ వైద్యురాలు వివరించారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో సురేందర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

### చట్టాలపై అవగాహన ఉండాలి

కామారెడ్డి, జూన్ 21 : జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ పాఠశాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ వీఆర్ఆర్ వరప్రసాద్ శనివారం సందర్శించారు. పాఠశాలలో స్కూల్ ఆధారిత రేడియో స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ నాగరాణి, స్కూల్ చైర్మన్ పున్న రాజేశ్, డైరెక్టర్ అరుణ, ప్రిన్సిపాల్ స్వాతి ప్రియ, న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్ రెడ్డి, సిబ్బంది ఖాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యుత్ అధికారుల పొలం బాట

బాన్సువాడ రూరల్, జూన్ 21 : బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో విద్యుత్‌శాఖ అధికారులు రైతులతో కలిసి శనివారం పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టామని ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో లైన్‌మన్ అక్తర్, ఏఎల్ఎం నవీన్, రైతులు పాల్గొన్నారు.

### బూత్ లెవల్ అధికారుల శిక్షణపై సమీక్ష

బాన్సువాడ, జూన్ 21 : జూలై నెలలో బూత్ లెవల్ అధికారుల శిక్షణ కోసం బాన్సువాడ నియోజకవర్గ తహసీల్దార్లు, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో సబ్ కలెక్టర్ కిరణ్మయి శనివారం సమీక్ష నిర్వహించారు. బాన్సువాడ , బీర్కూర్, నస్రుల్లాబాద్, వర్ని, కోటగిరి, చందూర్, మోస్రా, రుద్రూర్, పొతంగల్ మండలాల తహసీల్దార్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వరప్రసాద్, శ్రీలత, సువర్ణ, గంగాధర్, ఫాతిమా, మారుతి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల పాఠశాలను తరలించొద్దని

# విద్యార్థినుల ధర్నా


బీబీపేటలో ధర్నా చేస్తున్న బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు

బీబీపేట, జూన్ 21:బీబీపేట బాలికల ఉన్నత పాఠశాలను బాలుర ఉన్నత పాఠశాలలోకి తరలించవద్దని కోరుతూ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలో శనివారం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఏండ్లుగా కొనసాగుతున్న బాలికల ఉన్నత పాఠశాలను బాలుర ఉన్నత పాఠశాలలోకి తరలిస్తే.. విద్యార్థినుల చదువుతోపాటు భద్రతకు ఇబ్బందులు ఎదురవుతాయని విద్యార్థినుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. అటువైపు వెళ్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి విషయం తెలుసుకొని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలను అక్కడే కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న జూనియర్ కాలేజీని గ్రంథాలయంలో కొనసాగించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఇబ్బందులు లేకుండా ఛత్రపతి ఫౌండేషన్ వారు నిర్వహించిన గ్రంథాలయాన్ని పునః ప్రారంభించాలని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పెరమాండ్లతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి కళాశాల భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, నిరుద్యోగ యువత సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డీఈవో రాజు, డీఏబీవో సలాం, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, కళాశాల సాధన సమితి సభ్యులు సంతోష్ గౌడ్, దేవుపల్లి దేవరాజ్, పోసు శివకుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సూతరి రమేష్, పాత రాజు, దేవునిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో వ్యాక్సినేషన్


చిన్నారులకు టీకా ఇస్తున్న ఏఎన్ఎం

బాన్సువాడ రూరల్, జూన్ 21 : బాన్సువాడ మండలంలోని జక్కల్ దాని తండా అంగన్‌వాడీ కేంద్రంలో బోర్లం సబ్‌సెంటర్ ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు టీకాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేం ద్రంలో ప్రతి మూడో శనివారం వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఏఎన్ఎంలు యశోద, అనురాధ, పండరి, అంగన్‌వాడీ టీచర్ సోనీ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ**

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 21: మండలంలోని సఫ్దల్‌పూర్ గ్రామాన్ని శనివారం ఎంపీడీవో ప్రకాశ్ పరిశీలించారు. గ్రామ ప్రాథమిక పాఠశాలలో యోగా డే కార్యక్రమాలను పరిశీలించి, పాఠశాల పరిస్థితిని సమీక్షించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

# ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి


కామారెడ్డిలో జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆచార్య జయశంకర్ వర్ధంతి నిర్వహిస్తున్న అధ్యాపకులు


బాన్సువాడలో జయశంకర్ సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

కామారెడ్డి, జూన్ 21 : ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కమాన్ వద్ద ఉన్న జయశంకర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు, పట్టణ స్వర్ణకార సంఘం సభ్యులు శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఉద్యమంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా మలిదశ పోరాటానికి పునాది వేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు హఫీస్ బేగ్, అధికార ప్రతినిధి గైని శ్రీనివాస్ గౌడ్, మల్లేశ్ యాదవ్, సంఘి మోహన్, మాసుల లక్ష్మీనారాయణ, పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు చక్రం, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి బ్రహ్మం, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, సలహాదారులు శ్రీనివాస్, వైవి.రమణాచారి, సభ్యులు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..**

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 21: ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం తెలంగాణ ఉద్యమ సిద్ధాంత కర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. జయశంకర్ జీవన విధానాన్ని ఆదర్శంగా తీసుకొని, ఆయన బాటలో ప్రతిఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, తెలుగు శాఖ అధ్యక్షుడు శంకరయ్య, అధ్యాపకులు అరుణ్‌కుమార్, నాగానిక, విద్యార్థులు పాల్గొన్నారు.

**బాన్సువాడలో..**

బాన్సువాడ, జూన్ 21 : బాన్సువాడలో జయశంకర్ వర్ధంతిని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బాన్సువాడ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, బోడ చందర్, మోచి గణేశ్, రమేశ్ యాదవ్, సాయి బాబా, చాకలి మహేశ్, గాండ్ల కృష్ణ, సూరి, మన్నే అనిల్, షేక్ గౌడ్, మౌలా, సమీర్, సంజయ్, జావీద్, హన్మాండ్లు, టీయూఎఫ్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్ గుప్తా, చందు, బాబా గౌడ్, బీమానాయక్, భాస్కర్ గౌడ్, కల్వ శ్యామ్, యోగి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తప్పవు


పిట్లంలో దుకాణ యజమానులకు జరిమనా రసీదు అందజేస్తున్న గ్రామ కార్యదర్శి బలరాం

పెద్ద కొడప్‌గల్ (పిట్లం),జూన్ 21 : పిట్లం మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం నుంచి వైకుంఠధామం వరకూ రోడ్డుపై చెత్త వేసిన దుకాణాదారులను గుర్తించి వారికి శనివారం గ్రామ కార్యదర్శి బలరాం రూ.2వేల జరిమానా వేసి రసీదులను దుకాణ యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దుకాణాదారులు ఎవరైనా రోడ్లపై చెత్త వేస్తే 2018 తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుని లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

### ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

పెద్ద కొడప్‌గల్ (పిట్లం),జూన్ 21 : గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఇంటి దగ్గర ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ఎంపీడీవో కమలాకర్ అన్నారు. పిట్లం మండలంలోని కారేగాం, కంబాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. ఇల్లు మంజూరైన ప్రతి లబ్ధిదారుడు నిర్మాణం చేపట్టాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేని ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని, ప్రభుత్వం ఇంకుడు గుంతల నిర్మాణానికి రూ.6 వేలు అందిస్తుందని తెలిపారు. ఆయనవెంట ఎంపీవో నాగరాజు, ఏపీవో మహేశ్, టెక్నికల్ అసిస్టెంట్లు సతీశ్, తుకారాం, గ్రామ కార్యదర్శి అంబయ్య తదితరులున్నారు.

### 'భూభారతి' దరఖాస్తుల ఆన్‌లైన్

నాగిరెడ్డిపేట, జూన్ 21: గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సుల్లో రైతులు చేసుకున్న దరఖాస్తులను కంప్యూటర్‌లో ఆన్‌లైన్ చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. మండలంలో 2,624 దరఖాస్తులు వచ్చాయని, వాటిని కలెక్టర్ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా ఆన్‌లైన్ చేయాలని కంప్యూటర్ ఆపరేటర్ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బందికి సూచించినట్లు ఆయన పేర్కొన్నారు.

### కార్యదర్శి ఫిర్యాదుపై కేసు నమోదు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 21: గ్రామ కార్యదర్శి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మల్కాపూర్ గ్రామానికి చెందిన పెద్దెడ్ల నర్సింహులు తన ఇంటి నిర్మాణంలో కొంత భాగం దారిలో కడుతున్నాడన్నారు. ఈ విషయంలో ఇంటి నిర్మాణ పనులు ఆపాలని మూడుసార్లు నోటీసులు ఇచ్చినా పనులను ఆపకుండా కొనసాగిస్తున్నాడు. గ్రామపంచాయతీ, పై అధికారుల ఉత్తర్వులను దిక్కరిస్తున్నట్లు అతడిపై గ్రామ కార్యదర్శి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

పెద్దకొడప్‌గల్, జూన్ 21 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన, పాఠశాలలో ఎస్సై మహేందర్ యాంటీ డ్రగ్స్ అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగించి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు గంజాయి, గుట్కా, కల్లు, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అవి అనర్థాలకు దారి తీస్తాయని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


తాడ్వాయిలో స్వయం సహాయక సంఘాల మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో సురేందర్

లింగంపేట(తాడ్వాయి), జూన్ 21: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని డీఆర్డీవో సురేందర్ సూచించారు. తాడ్వాయి మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో శనివారం ఏర్పా టు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు పారిశ్రామికంగా ఎదగడానికి అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా వారు ప్రపంచ బ్యాంకు నిధుల సహకారంతో తెలంగాణలో పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటు, నిర్వహణ, ఉత్పత్తులు, మార్కెటింగ్ నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న మహిళలకు 15 రోజుల పాటు శిక్షణ ఇస్తామని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం రమేశ్, ప్రాజెక్టు అధికారి మహ్మద్ ఖాసీం, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి లాలూనాయక్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్, ఏపీఎం మనోహర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు యశోద, మండలాలకు చెందిన వ్యాపారవేత్తలు, సీసీలు పాల్గొన్నారు.

**పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి..**

బాన్సువాడ, జూన్ 21: బాన్సువాడలోని ఐకేపీ కేంద్రంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో జిల్లా అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఔత్సాహిక మహిళలకు 15 రోజులపాటు పరిశ్రమ నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్‌లో మెళకువలు, నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీవో అధికారి సుధాకర్, చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ ప్రవీణ్, ఏపీఎం పద్మ, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## కూలిన చెట్టును తొలగించండి


అవాజ్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రం ఎదుట కూలిన చెట్టు

బాన్సువాడ రూరల్, జూన్ 21 : వారం రోజుల క్రితం వీచిన ఈదురు గాలులకు బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అవాజ్‌పల్లి తండా అంగన్‌వాడీ కేంద్రం ఎదుట చెట్టు కూలింది. అంగన్‌వాడీ భవనంలోకి వెళ్లాలంటే కూలిన చెట్టును దాటుకుంటు లోపలి విద్యార్థులు వెళ్తున్నారు. చెట్టును తొలగించాలని గ్రామ పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని అంగన్‌వాడీ టీచర్ రేణుక తెలిపారు. కూలిన చెట్టును తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్, గ్రామస్తులు కోరుతున్నారు.

### ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

కామారెడ్డి, జూన్ 21 : జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారాన్ని ఆలయంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా వైద్య కిషన్ రావు, డైరెక్టర్లుగా కొత్త భీమ్‌రాజ్, దాసోజు శ్రీనివాస్ రెడ్డి, గంగమణి, గజవాడ శంకరయ్య, ఆలయ అర్చకుడు శ్రీనివాస్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, వేద పురోహితుడు గంగవరపు ఆంజనేయశర్మ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## కల్తీ కల్లుకు దూరంగా ఉండాలి


కల్లు బాధితులకు వైద్య పరీక్షలు చేయిస్తున్న ఎస్సై వెంకట్‌రావు

లింగంపేట, జూన్21: కల్తీ కల్లుకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై వెంకట్‌రావు సూచించారు. నిత్యం కల్లు తాగే అలవాటు ఉన్న పలువురికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానికులకు అవగాహన కల్పిస్తున్నామని, కల్తీ కల్లు, గంజాయి సేవించడం ద్వారా కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు రాంబాయి, పోలీసులు పెంటయ్య, జువ్వినాయక్, కాశాగౌడ్, మురళి, మదన్‌లాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ముదిరాజ్‌లకు వృత్తి నైపుణ్య పరీక్షలు

లింగంపేట, జూన్ 21: మండలంలోని బోనాల్ గ్రామంలోని ముదిరాజ్ సంఘం సభ్యులకు శనివారం చేపల వేటపై వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా మత్స్యకార పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు గాదం సత్యనారాయణ తెలిపారు. చెరువులో చేపల వేట కోసం వల విసరడం, ఈత కొట్టడం, పాండ్రీ లాగడం తదితర పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లా మత్స్య సహకార శాఖ అధికారి శ్రీపతి మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి మత్స్య సంపత పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి కార్మికుడు సంఘంలో సభ్యుడై ఉండాలని, సంఘం సభ్యులకు ప్రభుత్వం ప్రమాద బీమా అమలు చేస్తున్నదన్నారు. ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే రూ.ఐదు లక్షల బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు విఠల్, మత్స్య సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ రాధిక, ఫీల్డ్ అధికారులు సురేశ్, శ్వేత, ఫీల్డ్‌మన్ అక్తర్ మోమినొద్దీన్, సభ్యులు పాల్గొన్నారు.

### వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి

లింగంపేట, జూన్ 21: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి చంద్రశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శనివారం తనిఖీ చేసి వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమల నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అవరణలో నిర్వహించే పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు రాంబాయి, సిబ్బంది పాల్గొన్నారు.

### చెక్కుల పంపిణీ

పెద్దకొడప్‌గల్, జూన్ 21 : మండలంలోని కాటేపల్లి, కాటేపల్లి తండాలో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

### ఇంటి నిర్మాణ పనుల పరిశీలన

నాగిరెడ్డిపేట, జూన్ 21: మండలంలోని ధర్మారెడ్డి, మేలకుంట తండా గ్రామాల్లో చేపట్టిన ఇంటి నిర్మాణ పనులను ఎంపీడీవో ప్రభాకర్ శనివారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించాలని లబ్ధిదారులకు సూచించారు. రెండు గ్రామాల్లో పంచాయతీ రికార్డులను పరిశీలించారు.